సాక్షి
చిత్తూరు

బుధవారం । 11 । అక్టోబర్ । 2023



బోయకొండలో 15 నుంచి దసరా

బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల 15 నుంచి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ చంద్రమౌళి తెలిపారు. - IIలో



చిత్తూరు.. స్వచ్ఛసమీరం

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. - IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	23
తిరుపతి	36	23
తిరుమల	30	19
గూడూరు	37	25
నగరి	36	24

ఆరోగ్య ఆంధ్రప్రదేశే జగనన్న లక్ష్యం

- మంత్రి ఆర్కే రోజా

నింద్ర: ఆరోగ్య ఆంధ్రప్రదేశే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేశారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మంగళవారం నింద్ర మండలం మేళంబాకంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరినీ సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయాలన్న ఉద్దేశంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ఇందులో భాగంగానే ఆరోగ్య సురక్ష, విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ తదితర పథకాలు అమలు చేశారన్నారు. వైఎస్సార్ చేయూత, రైతుభరోసా తదితర సంక్షేమ పథకాలకు అర్హత ఉంటే అవి మీ ఇంటికే వస్తాయని, మీ బ్యాంకు ఖాతాలోకే నగదు జమ అవుతుందన్నారు. ప్రజలకు అవినీతి రహిత సంక్షేమం అందించారన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని మరోసారి సీఎంగా చేసుకుందామని ఆమె పిలుపునిచ్చారు. అనారోగ్యంలో బాధపడుతున్న పేదలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేసి, పైసా ఖర్చులేకుండా ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా పొందే అవకాశం కల్పించిందన్నారు. అనంతరం మంత్రి శిబిరానికి వచ్చిన 61 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఆయుష్మాన్ భారత్ పత్రాలను అందజేశారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ అమరేంద్రబాబు, సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, ఆర్బీకే చైర్మన్ వీరయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి మేరి, మండల కన్వీనర్ వేణురాజు, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, సర్పంచ్ బాలకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి రోజా

మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

- సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్
- చిత్తూరులో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం
- విద్యార్థులతో ర్యాలీ

చిత్తూరు రూరల్: మానసిక అనారోగ్యానికి చికిత్స చేయించాల్సిన బాధ్యత కుటుంబం, సమాజంపై ఉందని, ఆ దిశగా మానసిక ఆరోగ్యాన్ని కాపడుకుందామని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ అన్నారు. చిత్తూరులో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, అపోలో ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు అపోలో విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్, డీఎంఅండ్‌హెచ్ఓ ప్రభావతిదేవి ప్రారంభించి, మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో చదువులు, ఉద్యోగం, వ్యాపారం, ఆస్తుల, సంపాదన సహా అనేక రంగాల్లో తీవ్రమైన పోటీ నెలకొందన్నారు. మద్యం, డ్రగ్స్ తదితర దురలవాట్లు వ్యాపించాయన్నారు. ఇవి మానసిక ప్రశాంతతను దెబ్బతీస్తున్నాయన్నారు. దీంతో డిప్రెషన్‌కు గురవుతున్న వారి సంఖ్య పెరిగిందన్నారు. మానసిక వ్యాధి బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారని చెప్పారు. ముఖ్యంగా పిల్లలు మొబైల్ ఫోన్లకు దగ్గరయ్యారన్నారు. అవే ప్రపంచమనే రీతిలో వ్యవహరిస్తున్నారని, దీంతో అనేక రకాల అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారన్నారు. సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, మానసిక వైద్యనిపుణులు పద్మసుధాకర్, జయప్రియ, దినేష్, అపోలో నిర్వాహకులు రాంగోపాల్‌రెడ్డి, సుధాకర్, అధికారులు సుదర్శన్ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్, డీఎంఅండ్‌హెచ్ఓ ప్రభావతిదేవి

సర్టిఫికెట్ల పరిశీలన రేపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న టీజీటీలకు ఈ నెల 12వ తేదీన వైఎస్సార్ కడప జిల్లా కేంద్రంలో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోన్ 4 పరిధిలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న టీజీటీలకు పీజీటీలుగా ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు తెలిపారు. తుది సీనియారిటీ జాబితా ప్రకారం టీజీటీలు సంబంధిత రిజిస్టర్లు, ఒరిజనల్ సర్టిఫికెట్లు, 3 సంవత్సరాలు ఏసీఆర్(యాన్యూవల్ కాన్ఫిడెన్షిల్ రిపోర్టులు) తీసుకుని పరిశీలనకు హాజరుకావాన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన వైఎస్సార్ కడపలోని గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మేలు జాతి పేయదూడలను అభివృద్ధి చేద్దాం


మేలుజాతి దూడలను ఎంపిక చేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

పెనుమూరు(కార్వేటినగరం) మేలుజాతి దూడలను అభివృద్ధి చేసి, పాల దిగుబడిని పెంచేందుకు కృషి చేద్దామని పశు సంతతి పరిశీలన కేంద్రం సంచాలకులు డాక్టర్ వాసు అన్నారు. మంగళవారం మండలంలోని కామచిన్నయ్యపల్లెలో మేలుజాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాసు మాట్లాడుతూ విశిష్ట లక్షణాలు కలిగి, అధిక పాల దిగుబడినిచ్చే మేలుజాతి దూడలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పీటీపీ వీర్యంతో మేలుజాతి కోడెదూడలు, పేయదూడలను గత మూడేళ్లుగా అభివృద్ధి చేస్తున్నామని, రైతులు తమ ఆవులకు పీటీపీ వీర్యంతో గర్భధారణ చేయించుకోవడం ద్వారా మంచి లక్షణాలు గల పేయ, కోడెదూడల సంతతి పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ప్రదర్శనలో భాగంగా ఉత్తమ పాడిరైతులుగా వరలక్ష్మి, ఉమాపతి నాయుడు, రుక్మాంగధ నాయుడుకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న 70 మంది రైతులకు కూడా ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ గీతారెడ్డి, మండల పశువైద్యాధికారి డాక్టర్ పార్థీబన్, ఏహెచ్ఏలు దీపిక, లిఖిత, గోపాలమిత్రలు గీత, శర్మ, గోపాల్ పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి


డిప్యూటీసీఎంకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే నారాయణ స్వామి మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.

చిత్తూరు.. స్వచ్ఛసమీరం

రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధించడమే కాదు.. స్వచ్ఛతలో సైతం వెల్లివిరియాలి..అప్పుడే ప్రజలు అనారోగ్యానికి దూరంగా ఉంటారు..తద్వారా పల్లె, పట్టణం పరిఢవిల్లుతాయి.. ఈ దిశగా అడుగేద్దామని పిలుపునిచ్చిన మహాత్ముడి బాటలో పయనిద్దామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకున్న చిత్తూరు జిల్లా పారిశుద్ధ్యం మెరుగుపరచడంలో ముందడుగు వేస్తోంది. ఫలితంగా చిత్తూరు స్వచ్ఛసమీరంగా మారింది.

- పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత
- చెత్త సేకరణలో 1,592 మంది క్లాప్‌మిత్రలు
- జోరుగా సేంద్రియ ఎరువుల తయారీ

సాక్షి, చిత్తూరు: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఒకవైపు స్వచ్ఛభారత్ కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూనే, మరోవైపు క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)–జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది. క్లీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా చిత్తూరు జిల్లాలో కార్యక్రమం సాగుతోంది. గ్రామీణ, నగర ప్రాంతాల్లో క్లాప్‌మిత్ర కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్య కార్మికులు పారిశుద్ధ్య నిర్వహణ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ఇంటింటా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. ఉదయం 6 గంటల్లోపే పారిశుద్ధ్య కార్మికులు చెత్తను సేకరించి, బృందావనాలకు తరలిస్తున్నారు.

బృందావనాల్లో వర్మీకంపోస్టు తయారీ

క్లాప్‌మిత్ర కార్యక్రమంలో భాగంగా కార్మికులు తాము సేకరించిన తడి,పొడి చెత్తను సేకరించి ఆయా ప్రాంతాల్లోని బృందావనాల(సంపద కేంద్రాలు)కు తరలిస్తారు. అక్కడ ఆ చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు. జిల్లాలోని సుమారు 594 సంపద కేంద్రాల్లో రెండేళ్లలో ఇప్పటివరకు సుమారు 170 టన్నుల వర్మీకంపోస్టు (సేంద్రియ ఎరువులు) తయారు చేశారు. వాటిని రైతులకు విక్రయించటం ద్వారా సుమారు రూ.20 లక్షలు ఆదాయం ఆర్జించారు.

2500 వాహనాలతో చెత్త సేకరణ

జిల్లాలోని మొత్తం 31 మండల్లాలోని 697 పంచాయతీల్లో చెత్త సేకరణకు సుమారు 2500 వాహనాలు వినియోగిస్తున్నారు. ఇందులో 1660 ట్రైసైకిళ్ల , 67 ట్రాక్టర్లతోపాటు ఇతర వాహనాలు వినియోగిస్తున్నారు. నిత్యం 1,592 క్లాప్‌మిత్రలు, వారితోపాటు కార్మికులు చెత్త సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమాలను గ్రామస్థాయిలో కార్యదర్శి, మండల స్థాయిలో ఈఓపీఆర్డీ పర్యవేక్షిస్తున్నారు. దీంతో పల్లెలు, పట్టణాలు పరిశుభ్రంగా మారుతున్నాయి.


చెత్తసంపద కేంద్రం


వర్మీకంపోస్టు జల్లెడ పడుతున్న కార్మికులు


విధుల్లో పారిశుద్ధ్య కార్మికులు

3 చక్రాల వాహనాలతో చెత్త సేకరణ



నేను గ్రామంలో ఇంటింటా చెత్త సేకరించడానికి మూడు చక్రాల వాహనాన్ని ఉపయోగిస్తున్నాను. గ్రామంలో ఇళ్ల వద్దే తడి, పొడి చెత్తగా వేరు చేసి, సంపద కేంద్రానికి తీసుకెళతాం. అక్కడ వానపాముల ద్వారా తడి చెత్తను ఉపయోగించి, ఎరువు తయారు చేస్తున్నాం. పొడి చెత్తలో ప్లాస్టిక్ తదితర వస్తువులను వేరు చేస్తాం. తరువాత దాన్ని కూడా ఎరువు తయారీకి వినియోగిస్తాం. బాధ్యతగా పనిచేయడంతో నాకు ఇటీవల అవార్డు కూడా వచ్చింది.

-జి.నాగమ్మ, క్లాప్‌మిత్ర, కార్వేటి నగరం

బాధ్యత పెరిగింది



సచివాలయ, వలంటరీ వ్యవస్థతో పారిశుద్ధ్య కార్మికుల్లో బాధ్యత పెరిగింది. దీంతో పారిశుద్ధ్య పనులు భారీ ఎత్తున చేపడుతున్నారు. ఎప్పటికప్పుడు చెత్త తీసివేయడంతోపాటు ఇళ్లల్లో కూడా చెత్తను సేకరించి బృందావనాలకు తరలించి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు. ఆ ఎరువును పలువురు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఎరువులతో నాణ్యమైన పంటలు ఉత్పత్తి జరుగుతోంది.

-ఎల్.సత్యానందరెడ్డి, వడ్రంపల్లె, ఐరాల మండలం

వర్మీ కంపోస్టుకు మంచి డిమాండ్



మా గ్రామంలో క్లాప్‌మిత్రలు చెత్త సేకరిస్తున్నారు. పంచాయతీలో ఉన్న కొంతమంది కార్మికులు గ్రామంలోని రోడ్లను శుభ్రం చేస్తున్నారు. ఆ చెత్తను సంపద కేంద్రానికి తరలిస్తున్నారు. క్లాప్‌మిత్రలు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి సంపద కేంద్రానికి తరలిస్తారు. సంపద కేంద్రంలో ఆ చెత్తను వినియోగించి వర్మీకంపోస్టు తయారు చేస్తున్నారు. అది వాడితే పంట బాగా పండుతుండడంతో దానికి మంచి డిమాండ్ ఉంది.

-పీఎస్ లక్ష్మి, సర్పంచ్, వీకోట

క్లాప్‌మిత్రలు విశిష్ట సేవలు



పారిశుద్ధ్య పనుల నిర్వహణలో క్లాప్ మిత్రలు విశిష్టసేవలు అందిస్తున్నారు. పంచాయతీ కార్మికులు, క్లాప్‌మిత్రలతో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం. ఇంటింటా చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తున్నాం. అక్కడ చెత్తను ప్రాసెసింగ్ చేసి సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నాం. ఈ ఎరువులకు మంచి డిమాండ్ ఉంది. ఎప్పటికప్పుడు ఎరువులు విక్రయిస్తున్నాం.

-నరసింహులు, పంచాయతీ కార్యదర్శి, చంద్రమాకులపల్లె, పుంగనూరు మండలం

వర్మీ కంపోస్ట్ తయారీ



ఉదయం 6.30 గంటల్లోపు క్లాప్ మిత్రల పనుల వివరాలు పంచాయతీ కార్యదర్శులు గ్రూపుల వారీగా మెసేజ్‌లు పెడతారు. క్లాప్ మిత్రలు సేకరించిన తడి పొడి చెత్తను సంపద కేంద్రానికి తీసుకెళ్లి, వేర్వేరుగా నిల్వ ఉంచుతారు. 594 సంపద కేంద్రాల్లో తడి చెత్తతో వర్మీకంపోస్టు తయారు చేస్తున్నారు. గత రెండేళ్లలో 170 టన్నుల వర్మీకంపోస్ట్ తయారు చేశారు. ప్లాస్టిక్‌తో పాటు ఇతర సామాగ్రి 113 టన్నులు సేకరించాం. వీటి విక్రయంతో రూ.19 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది.

-షణ్ముగరామ్, ఇన్‌చార్జి, జిల్లా వనరుల కేంద్రం, చిత్తూరు

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత



జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం. పరిసరాల శుభ్రతపై ప్రజలకు పదేపదే అవగాహన కల్పిస్తున్నాం. పంచాయతీల్లో సిబ్బంది వీధుల్లో ఎలాంటి చెత్త పడకుండా, నీరు నిల్వ చేరకుండా చూస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో పంచాయతీ ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉంది. చెత్త సేకరణతోపాటు సంపద కేంద్రంలో వర్మీకంపోస్టు తయారు చేసే వరకు అన్ని బాధ్యతలను క్లాప్‌మిత్రలు తీసుకోవడంతో నాణ్యమైన సేంద్రియ ఎరువు తయారీ అవుతోంది.

-షణ్మోహన్, జిల్లా కలెక్టర్, చిత్తూరు

బోయకొండలో 15 నుంచి దసరా ఉత్సవాలు


ఆలయంలో క్యూల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న ఈఓ చంద్రమౌళి, పెద్దిరెడ్డి

చౌడేపల్లె: మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ చంద్రమౌళి తెలిపారు. మంగళవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలిసి ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లు, అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. రూ.2 కోట్ల వ్యయంతో జరుగుతున్న యాగశాల, అర్చకులు, సిబ్బంది వసతి గృహం, అమ్మవారికి జంతుబలులు సమర్పించేందుకు ఏర్పాటు చేసిన మండపం పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. దసరా మహోత్సవాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడానికి వస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు తీసుకోవాల్సిన ఏర్పాట్లు, వసతులు, కార్యచరణపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోయకొండలో పూర్తి చేసిన అభివృద్ధి పనులను మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించనున్నట్లు చెప్పారు. రద్దీకి తగిన విధంగా చర్యలు తీసుకోవడంతోపాటు నిత్య ప్రసాదం పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారిని పెద్దిరెడ్డి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సోమల మల్లికార్జునరెడ్డి, రవిచంద్రారెడ్డి, లడ్డు రమణ, సురేంద్రరెడ్డి, డిష్ సూరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎల్ రెడ్డి, మంజునాథ్, సురేంద్రరెడ్డి, వీర కుమార్ పాల్గొన్నారు.

నిరంతరం మెరుగైన విద్యుత్ సరఫరా

- సబ్సిడీ ఏటా రూ.500 కోట్లు
- వ్యవసాయ సరఫరా లైన్‌కు రూ.5 వేల కోట్లు
- సీఎండీ సంతోషరావు


మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా ఇస్తున్నామని ట్రాన్స్‌కో సీఎండీ సంతోషరావు తెలిపారు. మంగళవారం చిత్తూరులోని విద్యుత్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పలు రకాల సబ్సిడీ రూపంలో ఎస్సీ, ఎస్టీ, క్షురకులు, స్వర్ణకారులు ఇతర సర్వీసులకు ఉచిత విద్యుత్ సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం డిస్కమ్(రాయలసీమ, నెల్లూరు జిల్లాలు)పరిధిలో ఏటా రూ.500 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. అలాగే డిస్కమ్ పరిధిలోని వ్యవసాయ సర్వీసులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద పనులు ప్రారంభించారన్నారు. రూ.5 వేల కోట్లతో వ్యవసాయానికి ప్రత్యేకంగా లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటి ద్వారా గ్రామాల్లో త్రీఫేజ్ సరఫరా అందించనున్నట్లు తెలిపారు. స్మార్ట్ మీటర్ల వాడకంతో లైన్‌లాస్ తెలుస్తుందన్నారు. దీంతో రైతులకు జవాబుదారీతనం వస్తుందన్నారు. వ్యవసాయ సర్వీసులకు కరెంటు బిల్లులు కట్టాలనే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దన్నారు. జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు వేగంగా చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ హౌసింగ్ పథకం కింద ఇళ్ల నిర్మాణాలకు రుణం పొందినవారికి ఉచితంగా సర్వీసులు ఇస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఉచిత సర్వీసులతోపాటు ఫ్యాన్, ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్ ఇవ్వనున్నామని చెప్పారు. నూతన వ్యవసాయ సర్వీసులకు డబ్బులు కట్టిన నెలలోపు విడుదల చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. 48 గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేయాలన్నారు. విద్యుత్తు సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీజీఎంలు ధర్మజ్ఞాని, గురవయ్య, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈలు హరి, పద్మనాభపిళ్లై, రవికుమార్, డీఈలు శేషాద్రి, జయప్రకాష్, సతీష్, ఆనంద్, సుబ్రమణ్యం, కొండయ్య, శ్రీలక్ష్మి, ఏఏఓ గీత, జేఏఓ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన పెంచుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ లక్ష్మి

నగరి : సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా గ్రామాల అభివృద్ధికి నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తి చేస్తూ సంబంధిత యాప్‌లో వివరాలను నమోదు చేయాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డీపీఓ లక్ష్మి అన్నారు. మంగళవారం జిల్లాలో డివిజన్‌ల వారీగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు డివిజనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీ, మండల లెవెల్ మానిటరింగ్ కమిటీలోని మండల స్థాయి అధికారులకు అవసరమైన శిక్షణ నిమిత్తం నగరి డివిజన్‌కు సంబంధించి నగరి వెలుగు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ, డీపీఓ మాట్లాడుతూ గ్రామీణస్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి రాష్ట్రప్రభుత్వం విధివిధానాలను రూపొందించిందని, లక్ష్యాలను సాధించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ప్రజలకు పేదరిక నిర్మూలన, ఆరోగ్యకర జీవన విధానం, తాగునీటి వసతి, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పన, సామాజిక భద్రత, సుపరిపాలన వంటి అంశాల్లో సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి సూచికలకు సంబంధించిన అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామస్థాయిలో వివరాలు అక్టోబర్ 12వతేదీ లోపు సేకరణ పూర్తి కావాలన్నారు. వ్యాలిడేషన్ ప్రక్రియ అక్టోబర్ 25వ తేదీ లోపు పూర్తి చేయాలని, అక్టోబర్ 31 లోపు మొత్తం పూర్తి కావాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుజన, డీఎల్‌డీఓ రవికుమార్, ఎంపీడీఓ లీలామాధవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సుసిర్థ అభివృద్ధికి సర్వే

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని గ్రామాల్లో సుసిర్థ అభివృద్ధి కోసం సర్వే చేయనున్నట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో డివిజనల్, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆర్‌డీఓ రేణుక, డీఎల్‌డీఓ రవికుమార్‌లతో కలిసి మాట్లాడారు. పల్లెలో పరిశుభ్రత, తాగునీరు, పేదరిక నిర్మూలన, ఆరోగ్యకర జీవనవిధానం, మౌలిక వసతుల కల్పన వంటి మొత్తం 9 అంశాల మీద 23 శాఖల ఆధ్వర్యంలో వివరాల నమోదు చేయాలన్నారు.

పెంకాక్ సిలాట్ క్రీడలో కార్వేటినగరం విద్యార్థులకు స్వర్ణం


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి

కార్వేటినగరం: కేరళలోని త్రివేంద్రం జిమ్మీజార్జ్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల ఒకటి నుంచి 3వ తేదీ వరకు నిర్వహించిన పెంకాక్ సిలాట్ సౌత్‌జోన్ చాంపియన్ షిప్‌లో కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. మంగళవారం స్వర్ణ పతకాలు అందుకున్న విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు కళాశాల ఉపాధ్యాయులు చేయూత నందించి, ప్రోత్సాహిస్తున్నారన్నారు. తమ కళాశాలలో బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.గౌతమ్, డి.లోకేష్‌ను ప్రతి విద్యార్థిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వ్యాయామ విద్య అధ్యాపకులు జోగి ప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీఎస్ లత, అధ్యాపకులు లావణ్య పాల్గొన్నారు.

13న జిల్లాకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఈనెల 13వ తేదీన చిత్తూరు జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారులకు సమాచారం అందింది. ఆయన శుక్రవారం జిల్లాలో పలు ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలు ఆకస్మికంగా తనిఖీ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు–నేడు పనుల పురోగతి, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించనున్నారు.

ప్రసన్న వెంకన్న పవిత్రోత్సవాలు ప్రారంభం


పవిత్ర ప్రతిష్ట సందర్భంగా మహా హారతి ఇస్తున్న అర్చకులు


స్నపన తిరుమంజనం చేస్తున్న వేద పండితులు

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజైన మంగళవారం తెల్లవారు జామున సుప్రభాత సేవతో శ్రీస్వామివారిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, అర్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో యాగశాలలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. తదుపరి శ్రీపద్మావతి, ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేశ్వస్వామి వారికి స్నపన తిరుమంజనం వేదోక్తంగా చేపట్టారు. సాయంత్రం ఉభయ దేవేరుల సహా స్వామివారి ఉత్సవర్లను పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలు, పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు. తదుపరి తిరువీధి ఉత్సవం నయనానందకరంగా జరిగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. రాత్రి యాగశాలలో హోమం, వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్ పర్యవేక్షించారు.

నేడు పవిత్ర సమర్పణ : పవిత్రోత్సవాల్లో రెండవ రోజు బుధవారం ఉదయం 9–30 గంటలకు స్నపన తిరుమంజనం, 11–30 నుంచి 12–30 గంటల నడుమ స్వామి, అమ్మవార్లకు పవిత్ర సమర్పణ ఉంటుందని ఆలయ ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డికి వినాయకుడి లడ్డూ ప్రసాదం



మంత్రి పెద్దిరెడ్డికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న శైలజాచరణ్ రెడ్డి దంపతులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి వద్ద ఉంచిన 21 కిలోల లడ్డూ ప్రసాదాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అందజేశారు. ఈ లడ్డూను బ్రహ్మోత్సవాల చివరి రోజుల వేలం వేశారు. అగరంపల్లికు చెందిన శైలజాచరణ్ రెడ్డి దంపతులు రూ.1.28 లక్షలకు దక్కించుకున్నారు. మంగళవారం తిరుపతిలోని మంత్రి నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి లడ్డూ ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట ఆలయ మాజీ చైర్మన్ జగన్నాథరెడ్డి, సురేష్ ఉన్నారు.

టెన్త్ ఫెయిలైన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించండి



మెకానికల్ షెడ్‌లో పనిచేస్తున్న విద్యార్థితో మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

బంగారుపాళెం: పదోతరగతి ఫెయిలైన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఈఓ విజయేంద్రరావు సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం సాయంత్రం సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్టు అధికారి వెంకట్రామిరెడ్డితో కలసి ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షల తీరును పరిశీలించారు. విద్యాసంవత్సరంలో సిలబస్ గురించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. గత రెండేళ్లలో పదో తరగతి ఫెయిలైన విద్యార్థులతో పరీక్ష ఫీజు కట్టించేలా సీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బంగారుపాళెంలో టెన్త్ ఫెయిలైన స్కూటర్ మెకానికల్ షెడ్డులో పనిచేస్తున్న విద్యార్థిని గుర్తించి, అక్కడికి వెళ్లి విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

మట్కా కేసులో ముగ్గురి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ

నగరి : మట్కా కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ సురేష్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. మున్సిపాలిటీలోని కరకంతాపురం – తెరణి జంక్షన్ వద్ద ఉన్న మర్రిచెట్టు వెనుక మట్కా జరుగుతున్నట్లు మంగళవారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన సీఐ తన సిబ్బందితో కలిసి ఆప్రాంతంలో దాడులు చేశారు. ఆ సమయంలో అక్కడ మట్కా ఆడుతున్న పుదుపేటకు చెందిన టి. బాలాజీ (28), జేపీ సుబ్రహ్మణ్యం (51), ఏకాంబరకుప్పం ప్రాంతానికి చెందిన ఓ.పురుషోత్తం (45)ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మట్కా రాసిన స్లిప్పులు, చార్ట్ బోర్డ్‌తో పాటు నగదు రూ. 2 లక్షల నగదు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

అల్ట్రా స్కానింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్.

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అల్ట్రా స్కానింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీసీపీఎన్‌డీటీ (గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం) పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాకు సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న అల్ట్రా స్కానింగ్ కేంద్రాలపై నిఘా పెంచాలన్నారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడేవారిని గుర్తించి నివేదిక అందజేయాలన్నారు. స్కానింగ్ యంత్రాల దుర్వినియోగాన్ని అరికట్టడానికి అంతరాష్ట్ర చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్, పోలీస్ శాఖలను సమన్వయం చేసుకోవాలన్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మెడికల్ షాపుల తనిఖీల నివేదిక ప్రతి నెలా సమర్పించాలని ఆదేశించారు. పుట్టబోయే శిశువుల లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధం అనే విషయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌ఎంపీలందరికీ జిల్లాస్థాయిలో ఒక అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్కానింగ్ సెంటర్లను నిత్యం తనిఖీలు చేయాలని చెప్పారు. భ్రూణ హత్యల నివారణలు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంఅండ్‌హెచ్ఓ ప్రభావతి, జిల్లా ఒకటో న్యాయ స్థానం అదనపు న్యాయాధికారి రమేష్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యనియంత్రణకు పకడ్బందీగా చర్యలు

జిల్లాలో కాలుష్యనియంత్రణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కాలుష్య మండలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతను పాటించేందుకు వివిధ శాఖల పనితీరు నివేదికలను ఈ నెల 15వ తేదీ లోపు అందజేయాలన్నారు. కాలుష్య నియంత్రణ, బయోవేస్ట్ విషయంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. వాతావరణ కాలుష్యం తగ్గించేందుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వివిధ శాఖల నుంచి నివేదికలు కోరుతోందన్నారు. మొదట జిల్లా సమాచారం మున్సిపల్ ప్రాంతాలలో వేస్ట్ మేనేజ్మెంట్‌కు సంబంధించి పాటిస్తున్న విధానం వివరాలు, వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం, ఇండస్ట్రియల్ వాటర్ వేస్ట్, మైనింగ్ యాక్టివిటీకి సంబంధించిన శాఖల నివేదికలను ఈ నెల 15వ తేదీలోపు అందజేయాలన్నారు. నివేదికల సేకరణలో ఏవైన సమస్యలుంటే సంబంధిత శాఖల అధికారులు చర్చించుకోవాలని తెలిపారు. జిల్లాలోని ఆస్పత్రుల్లో వేస్ట్‌మేనేజ్‌మెంట్ ఏఏ ప్రాంతాలకు పంపుతున్నారో పూర్తి నివేదిక అందజేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాలుష్య మండలి ఈఈ నరేంద్రబాబు, ఏడీ మధుసూదన్, మైన్స్ డీడీ ప్రసాద్, డీటీసీ నిరంజన్, డీపీఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల సుస్థిర అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి

పలమనేరు/గంగవరం: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని పంచాయతీల అభివృద్ధికి కృషి చేద్దామని చిత్తూరు జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి సూచించారు. పట్టణ సమీపంలోని మదర్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో పీడీఐ(పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్)పై డివిజనల్ కమిటీ మోనిటరింగ్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల సుస్థిర అభివృద్ధికి నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తి చేసి, ఆ వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామీణ స్థాయిలో సుస్థిర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం విధివిధాలను రూపొందించిందన్నారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలన, ఆరోగ్యకర జీవనం, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, సామాజిక భద్రత, మౌళిక వసతులు తదితర అంశాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లాస్థాయి సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. డివిజినల్ స్థాయిలో మానిటరింగ్ కోసం డీఎల్‌పీఓ చైర్మన్ డివిజినల్ అధికారులు సభ్యులుగా ఉంటారని ఆయన తెలిపారు. మండల స్థాయిలో డేటా వ్యాలిడేషన్ కమిటీకి చైర్మన్‌గా సంబంధిత ఎంపీడీఓలు వ్యవహరిస్తారన్నారు. పంచాయతీల వారీగా సేకరించిన సమాచారాన్ని సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లు ఆయా పోర్టళ్ల ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇదే కాపీని ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలన్నారు. దీని ద్వారా వారు గ్రామసభలో ఆమోదం తెలుపాల్సి ఉంటుందన్నారు. ఆపై బ్లాక్‌లెవెల్ ఆమోదం జరుగుతుందని ఆయన తెలిపారు. గ్రామస్థాయిలో వివరాలు ఈనెల 12వ తేదీలోపు, ఆపై వ్యాలిడేషన్ ప్రక్రియ ఈనెల 25లోపు జరిగి మొత్తానికి ఇందుకు సంబంధించిన పూర్తి సర్వే ఈనెలాఖరుకు పూర్తి కావాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డీపీఓ లక్ష్మి, పలమనేరు ఆర్డీఓ శివయ్య, డీఎల్‌పీఓ ఉమావాణి, డిస్టిక్ కోఆర్డినేటర్ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు





వైద్యఆరోగ్య శాఖ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్ , సమీక్షలో పాల్గొన్న డాక్టర్లు, ఏఎన్ఎంలు.

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించారు. గిరిజన, రెవెన్యూ శాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాల్లో సమస్యలను మండలాల వారీగా సేకరించాలన్నారు. గంగవరం మండలం కుయ్యావంకలో నివసిస్తున్న 18 మంది గిరిజనులకు ఇళ్ల పట్టాలను మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆ ప్రాంతంలో ఏనుగులు ఎక్కువగా సంచరిస్తున్నందున వారికి భద్రత ఉండేలా కాలనీ చుట్టూ కందకం ఏర్పాటు చేసేందుకు ట్రికార్ నుంచి అనుమతి పొందుతామన్నారు. ఇప్పటివరకు ఆ ప్రాంతంలో నివసిస్తున్న 15 మంది గిరిజనులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చారన్నారు. వాటికి హద్దులు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పలమనేరుకు సమీపంలోని సాంబార్‌పూర్ గ్రామానికి రోడ్డు ఏర్పాటుకు 0.95 హెక్టార్ల భూమిని ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, ఆర్డీఓలు రేణుక, శివయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీప్రసన్న, కిరణ్మయి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా పనుల్లో సమస్యలు పరిష్కరించండి

హంద్రీనీవా కాలువ పనుల సమస్యలు వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ పురోగతిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, హంద్రీనీవా ఎస్ఈ రాజగోపాల్, కుప్పం బ్రాంచ్‌కెనాల్ ఈఈ రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశుమరణాల నివారణకు చర్యలు

జిల్లాలో మాతా శిశు మరణాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. గత రెండు నెలల్లో జిల్లాలో జరిగిన మాతా శిశు మరణాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాతాశిశు మరణాల తగ్గింపుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కేసుల వారీగా వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి, డీఐవో రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర త్రోబాల్ జట్టుకు పరమేశ్వరమంగళం విద్యార్థి



తిమోత్తిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుత్తూరు రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ త్రోబాల్ అండర్–14 రాష్ట్రస్థాయి పోటీలకు పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పి.తిమోత్తి ఎంపికైనట్లు హెచ్ఎం ఎ.చంద్రశేఖర్‌శెట్టి తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ నగరి మండలం ఏకాంబరకుప్పంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో తిమోత్తి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రజట్టుకు ఎంపికై నట్లు తెలిపారు. నంద్యాల జిల్లాలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీడీ నందకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని యువకుడి మృతి

చంద్రగిరి: ఉరివేసుకుని యువకుడు మృతి చెందిన ఘటన చంద్రగిరి పంచాయతీ, ఇందిరమ్మ కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చంద్రగిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన ఈశ్వర్‌రెడ్డి, సరళ దంపతుల కుమారుడు ధనుంజయులు అలియాస్ పండు(26) పెయింటర్. మూడేళ్ల క్రితం కావేరి అనే యువతితో ధనుంజయులుకు వివాహమైంది. వీరికి రెండేళ్ల పాప ఉంది. ఈ క్రమంలో ధనుంజయులు జల్సాలకు అలవాటుపడి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తరచూ ఇంట్లో గొడవలు జరుగుతూ ఉండేవి. సోమవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన ధనుంజయులు కుటుంబ సభ్యులతో గొడవకు దిగాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని తనువు చాలించాడు. దీనిపై పోలీసులను సంప్రదించగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

వెంకటగిరి రూరల్: ఇంట్లో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని బంగారుపేటలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం.. కలువాయి మండలం, కనుపూరుపల్లి గ్రామానికి చెందిన బొమ్మన నాగార్జున (35), బంగారుపేటకు చెందిన మౌనిక భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన నాగార్జున తరచూ భార్యతో గొడవపడేవాడు. భర్త వేధింపులు భరించలేక భార్య మౌనిక పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో నాగార్జున కూడా బంగారుపేటలోనే మరో ఇంటిని అద్దెకు తీసుకుని నివాసముంటున్నాడు. గత శనివారం నాగార్జున అనారోగ్యానికి గురికావడంతో భార్య మౌనిక, ఆమె తల్లి బంగారుపేట పీహెచ్‌లో వైద్య పరీక్షలు చేయించారు. ఆపై నాగార్జున ఉండే నివాసం వద్దకు తీసుకొచ్చి వదిలిపెట్టారు. అప్పటి నుంచి నాగార్జున కనిపించకుండా పోయాడు. అనుమానంతో మౌనికతల్లి నాగార్జున ఉండే నివాసం వద్ద పరిశీలించగా అతను మృతిచెంది ఉన్నాడు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తులో ఉంది.

క్లుప్తంగా

పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మంత్రి పెద్దిరెడ్డితో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, మోహన్‌రెడ్డి

పూతలపట్టు(యాదమరి): పార్టీ కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విద్యుత్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, కాణిపాకం ఆలయ తాజా మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డికి సూచించారు. మంగళవారం ఉదయం విజయవాడలోని మంత్రి చాంబర్‌లో వారు పెద్దిరెడ్డిని కలిశారు. ఆయనకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

టీడీపీ నేతల ప్రవర్తన హేయం

- ఓటమి భయంతోనే ఎమ్మెల్సీపై నిందలు
- విమర్శలు మితిమీరితే ఊరుకునేది లేదు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్

కుప్పం: ఫేక్ అకౌంట్‌ను అడ్డుపెట్టుకుని టీడీపీ నేతలు ప్రవర్తిస్తున్న తీరు హేయమని కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ మండిపడ్డారు. ఎమ్మెల్సీ భరత్ ఫేస్‌బుక్ అకౌంట్‌లో మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు పోస్టింగ్ పెట్టారని ఆరోపిస్తూ కొందరు టీడీపీ మహిళా నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంపై ఆయన మండిపడ్డారు. మంగళవారం ఎమ్మెల్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ భరత్ కుప్పంలో స్థిరపడి ఏడేళ్లు గడుస్తున్నా ఏ మహిళను అసభ్యకరంగా మాట్లాడిన సందర్భం లేదన్నారు. ఫేస్‌బుక్‌లో ఎమ్మెల్సీ పేరిట ఫేక్‌అకౌంట్‌లో వచ్చినా పోస్టింగ్ ఆధారంగా కొందరు మహిళలు ఇష్టానుసారంగా మాట్లాడడం సబబుకాదన్నారు. ఐఏఎస్ అధికారి కుమారుడు, ఐపీఎస్ అధికారి అల్లుడైన భరత్ ఎంతో సంప్రదాయ కుటుంబంలోని తండ్రి ఆశయాలకు అనుగుణంగా రాజకీయాల్లో వచ్చిన వ్యక్తి అన్నారు. మహిళలంటే గౌరవం అభిమానం ఉన్న ఎమ్మెల్సీపై నిందలు మోపడం మంచిదికాదన్నారు. భవిష్యత్తులో కుప్పంలో భరత్ చేతిలో ఓడిపోతామనే భయంతో కొందరు మహిళలను రెచ్చగొట్టి నిందలు వేసి, కుప్పం నియోజకవర్గంలో సానుభూతి సంపాదించడం కోసం ఇలాంటి పనులు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో మహిళల పక్షపాతి ప్రభుత్వంగా ప్రజలు ఆదరిస్తున్నారని, టీడీపీ ప్రలోభాలకు ఎవరు మోసపోరన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా మాట్లాడితే నాలుక కోస్తామని హెచ్చరించారు. ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ కుప్పం టీడీపీ నాయకులు ఇంత దిగజారుడు రాజకీయాలు పాల్పడతారని ఊహించలేదన్నారు. ఫేక్ అకౌంట్ లో వచ్చినా మెసేజ్‌ను చూసి, నిజమా? కాదా అని తెలుసుకోకుండా మచ్చలేని, మంచితనానికి చిరునామా అయిన ఎమ్మెల్సీ భరత్‌పై నిందలు వేయడం సహించరానిదన్నారు. టీడీపీ నాయకులకు చేతకాక మహిళలతో తప్పుడు మెసేజ్ చూపి ఫిర్యాదు చేయడం తగదన్నారు. తమ నాయకులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌పై ఇస్టానుసారంగా ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని, తగురీతిలో బుద్ధి చెప్పి తీరుతామన్నారు. కౌన్సిలర్ మాధవి మాట్లాడుతూ టీడీపీ మహిళలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎమ్మెల్సీ భరత్‌పై ఫిర్యాదు చేయడం తగదన్నారు. అంతేకాకుండా రాజకీయాల కోసం ఇంట్లో ఉన్నా ఆడవారి గురించి మాట్లాడడం సంస్కారం కాదన్నారు. దూషణలు, నిందలు ఒకస్థాయి వరకే ఉంటే మంచిదని, మితిమీరిపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నాగరాజ్, భాగ్యరాజ్, రంగయ్య, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న దాత ఆనందరెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారికి చంద్రగిరి మండలం ఎర్రేపల్లె గ్రామానికి చెందిన ఆనందరెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ బాబు ఉన్నారు.

రైఫిల్ షూటింగ్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలోని ఎస్వీజేఎస్ఎం పాఠశాల ఆవరణలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్–14, 17, 19 రైఫిల్ షూటింగ్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి దాదాపు 250 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఆయా విభాగాల్లో పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రదర్శన కనబరిచిన 27 మంది బాలురు, 27 మంది బాలికలను అండర్–14, 17, 19కు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు విజయకుమారి, జయరామయ్య తెలిపారు.

ఆఫ్‌లైన్‌లో రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: ప్రజా పంపిణీలో తలెత్తిన సర్వర్ సమస్య కారణంగా రాష్ట ప్రభుత్వం తాత్కాలికంగా ఆఫ్‌లైన్ పద్ధతిలో రేషన్ పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు డీఎస్ఓ శంకరన్ తెలిపారు. కార్డుదారులకు ఇబ్బంది లేకుండా ఎండీయూ ఆపరేటర్లు సరుకులు అందజేస్తారన్నారు. సాంకేతిక సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఆఫ్‌లైన్‌లో సరుకుల పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు.